క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



కె.పెదపూడిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న పాస్టర్ జీవరత్నం

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జోషఫ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు, ఇండియన్ నేవీ విశ్రాంత అధికారి యు.జీవరత్నం అన్నారు. కె.పెదపూడిలో జోషఫ్ మినిస్ట్రీస్ వద్ద పాస్టర్ జీవరత్నం ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. అల్లవరం సిలోయమి ఐ కేర్ వైద్యుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో 45 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఇందులో 10 మందికి కంటి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని, వీరిని రాజమహేంద్రవరం పరమహంస కంటి ఆసుపత్రికి 10న పంపనున్నట్లు ప్రభాకర్ తెలిపారు. వైద్యురాలు గ్రేస్ ఆధ్వర్యంలో 100 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అన్నదాన భవనానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ కిశోర్‌కుమార్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తాడేపల్లిగూడేనికి చెందిన కడిగట్లకు చెందిన నాగుల సత్యనారాయణ రూ.20,116 విరాళం అందించారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. దాతకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

అంబాజీపేట: అంబాజీపేట, గంగలకుర్రు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబాజీపేట, తొండవరం, వాకలగరువు, కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, నడిపూడి, పాలగుమ్మి, బండారులంక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రావులపాడు, ఊబలంక, కొమరాజులంక గ్రామాలతోపాటు రావులపాలెంలోని డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, ఆదిలక్ష్మీనగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. అలాగే ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ అంతరాయం కలుగుతుందన్నారు. గోపాలపురం, ఈతకోట, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు



పాశర్లపూడిలంకలో దోమల నిర్మూలనకు ఎబేట్ ద్రావణం పిచికారీ చేస్తున్న సిబ్బంది

మామిడికుదురు: పాశర్లపూడిలంకలో వ్యాధుల వ్యాప్తికి ప్రధాన కారణమైన దోమల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం ఎబేట్ ద్రావణాన్ని మురుగు కాలువల్లో పిచికారీ చేయించారు. మురుగు నీటి గుంతలు, నివాస ప్రాంతాల్లో ముంపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించామని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తెలిపారు. కార్యదర్శి డి.సురేష్, హెల్త్ అసిస్టెంట్ ఏడిద కవీంద్ర, ఏఎన్ఎం జి.కస్తూరి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 7 సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ ఉన్నాయన్నారు. బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీజెడ్‌సీ జువాలజీలకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు.

ఇరిగేషన్ డీఈపై ఆగ్రహం

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టుల నిర్వహణ అధ్వానంగా ఉందని ఇరిగేషన్ డీఈపై ఎమ్మెల్యే సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కొత్త, పాత అక్విడెక్టులను పరిశీలించారు. కొత్త అక్విడెక్టు రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోలేదని, మార్జిన్లలో మట్టిని తొలగించడం లేదని అన్నారు. పాత అక్విడెక్టుపై రావి మొక్కలతో పగుళ్లు ఏర్పడుతున్నాయన్నారు. సమస్యలను పట్టించుకోలేనప్పుడు, వేరేచోటకు బదిలీ చేయించుకుని వెళ్లిపోండని గిడ్డి హెచ్చరించారు. ఇప్పటికైనా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

వాడవాడలా జయంతి కార్యక్రమాలు



బి.సావరంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



వాడపాలెంలో రంగాకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: పేదల కోసం పాటుపడిన వంగవీటి మోహన్‌రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. వంగవీటి జయంతి సందర్భంగా వాడపల్లిలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ త్సామా బాబు, మాజీ సర్పంచ్ బండారు బులితాత పాల్గొన్నారు. వాడపాలెం వంతెన సెంటర్, కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్‌లో రంగా విగ్రహాలకు రాష్ట్ర బీజేపీ నాయకుడు పాలూరి సత్యానందం పూలమాలలు వేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి, పంచాయతీ సభ్యులు విళ్ల మారుతీ ప్రసాద్, చోడపనీడి భాస్కరరావు పాల్గొన్నారు. అవిడిలో ఎంపీటీసీ దూళి సూరిబాబు ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేశారు.

పి.గన్నవరం: మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో రంగా విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, బొండాడ నాగమణి తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరంలో కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

రాజోలు: దివంగత వంగవీటి మోహనరంగా స్ఫూర్తితో యువత ముందడుగు వేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బి.సావరం పెద్ద వంతెన వద్ద వంగవీటి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, సర్పంచ్ కడియం రమాదేవి, నాయకులు కుంపట్ల చిన్నారి, జగడం సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే తాటిపాక సెంటర్‌లో నాయకులు పోతు కాశీ, కటికిరెడ్డి బుజ్జి ఆధ్వర్యంలో, రాజోలు గాంధీబొమ్మ సెంటర్‌లో ఉప సర్పంచ్ పామర్తి రమణ, కాట్న రాజు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.



అంబాజీపేటలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పెదపట్నంలంకలో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆలమూరు: ఆలమూరులో శ్రీకృష్ణ దేవరాయ మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు నేతృత్వంలో రంగా అభిమానులు వేడుకలు నిర్వహించారు. కాపు నేత ప్రభాకరరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది పేదలు, కార్మికులకు వస్త్రదానం చేశారు. సంధిపూడిలోని పంచాయతీ కార్యాలయం వద్ద అభిమానులు కేక్ కట్ చేశారు. గ్రామంలో రంగా విశ్రాంత మండపానికి స్లాబ్ వేసి తుది మెరుగులు దిద్దేందుకు తమ వంతు సాయంగా సర్పంచ్ తోట భవానీ రూ.పది వేల విరాళాన్ని ఎంపీటీసీ తోలేటి సంతోషి చేతుల మీదుగా నిర్వాహకులకు అందజేశారు. పినపళ్లలో సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పట్టాభి ఆధ్వర్యంలో, రంగా యూత్ ఆధ్వర్యంలో జొన్నాడ, పెదపళ్ల, చొప్పెల్ల గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

అంబాజీపేట: అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఎదురుగా నాయకులు గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, బొంతు పెదబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మాచవరంలో మోహనరంగా విగ్రహాన్ని స్థానిక నాయకులు ఆవిష్కరించారు.

మామిడికుదురు: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వంగవీటి మోహనరంగా తన ప్రాణాలను సైతం పణంగా పెట్టారని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు అన్నారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక గ్రామాల్లోని రంగా విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మామిడికుదురులో రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: గుడిమెళ్లంక, శంకరగుప్తం గ్రామాల్లో రంగా విగ్రహాలకు నాయకులు నివాళులర్పించారు. ఆయా గ్రామాల సర్పంచులు నల్లి విజయలక్ష్మి, రాపాక ఆనంద్‌కుమార్, నాని పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర, కేశవదాసుపాలెం కాలువమొగ సెంటర్లలో రంగా విగ్రహాలకు రంగా యూత్, రత్న ఎస్సీ మెమోరియల్ యూత్ ఆధ్వర్యంలో నాగేంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోరిపోడులో వంగవీటి మోహన రంగా విగ్రహానికి వైఎస్సార్ సీపీ మాజీ కో ఆర్డినేటర్ బొంతు రాజేశ్వరరావు పూలమాల వేశారు. ముప్పర్తి త్రిమూర్తులు, ముప్పర్తి నాని ప్రసాద్, మేకల ఏసుబాబు పాల్గొన్నారు.

అయినవిల్లి: కూటమి నాయకుల ఆధ్వర్యంలో వంగవీటి మోహన్‌రంగా జయంతిని నిర్వహించారు. వీరవల్లిపాలెంలో వేడుకలు జరిగాయి.

ఏఐఎస్ఎఫ్ నిరసన



రాజోలులో ఆందోళన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

రాజోలు: నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రాజోలులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ విజయవంతం అయ్యింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు ఉంద్రు ప్రశాంత్, ఏఐవైఎఫ్ కన్వీనర్ వెంకట్, నాయకులు నిహాల్, జితేంద్ర, జి.హరి, టి.శరత్, సుప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి దోషులను శిక్షించాలని, విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తదితర డిమాండ్లతో మలికిపురంలో బంద్ చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు మూతపడ్డాయి. విద్యార్థి సంఘాల నేతలు దేవ రాజేంద్రప్రసాద్, రాపాక మహేష్, తాడి రవీంద్ర, నక్కా సంజయ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న దళిత చైతన్య వేదిక నాయకులు

రాజోలు: దళితులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. రాజ్యాంగపరంగా ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన నిధులు, రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు, కార్పొరేషన్, సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఎస్సీ, ఎస్టీల పురోభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల మురళీకృష్ణ, బత్తుల జనార్దనరావు, చిలకపాటి శ్రీధర్, మందపాటి మధు, దీపాటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఫొటో పెట్టాలని వినతి

మలికిపురం: ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ నాయకులు గురువారం మలికిపురంలో ఎంపీడీఓ బి.మంగాదేవికి వినతి పత్రం అందించారు. వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఇప్పటికే పెట్టారని, వాటితో పాటు ప్రధాని మోదీ చిత్రపటాన్ని పెట్టాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రధాని పిలుపు మేరకు తల్లికి వందనం పేరున మొక్కలు నాటారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యుడు దొడ్డ నాగబాబు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో విధిగా ప్రధాని మోదీ చిత్రపటం ఏర్పాటు చేయాలని బీజేపీ శ్రేణులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్‌కు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్యప్రకాశరావు, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు ఈ పత్రం ఇచ్చారు. టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాల మధ్య బాడిరేవుపై నిర్మించిన పక్కా వంతెనకు అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

బాలాజీ ఆలయాన్ని తీర్చిదిద్దుతా..



అప్పనపల్లిలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను సన్మానిస్తున్న పార్టీ నేతలు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి పర్యాటకంగా గుర్తింపు తీసుకువస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి ఆయన బుధవారం రాత్రి వచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు దీరిన బాలాజీ స్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే సత్యనారాయణను ఆలయ ఈఓ గ్రంధి మాధవితో పాటు ఉద్యోగులు, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదానంలో ఆదర్శంగా నిలిచిన అప్పనపల్లి ఆలయానికి ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఆలయాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగ్‌ల పరిశ్రమలకు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ

మలికిపురం: జ్యూట్ బ్యాగ్‌ల తయారీ పరిశ్రమలకు బ్యాంకు రుణాలు ఇస్తామని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ అన్నారు. కేశనపల్లిలో పది రోజులుగా నాబార్డు ఆధ్వర్యంలో జరుగుతున్న జ్యూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేశవవర్మ మాట్లాడుతూ శిక్షణ పూర్తయిన వారు కొత్తగా యూనిట్లు పెట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. నాబార్డ్ ఏజీఎం సోమునాయుడు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధర్, జ్యూట్ ఉత్పత్తి ట్రైనర్ తోట ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో పూజలు



విఘ్నేశ్వరుని సన్నిధిలో పూజలు చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్ దంపతులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో స్వామివారిని జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రావిరాల మహేష్‌కుమార్ కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు, అర్చకులు సత్కరించి, స్వామివారి ఆశీస్సులు అందజేశారు. కలెక్టర్‌కు స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి



సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మండపం వద్ద అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బుజ్జిరాజు

సఖినేటిపల్లి: బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు అన్నారు. గురువారం సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మండపం ఆవరణలో సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, నాయకులు ఇందుకూరి రమేష్‌రాజు, నల్లి ప్రేమానందం, రుద్రరాజు రంగరాజు, ఆర్.రామరాజు, ఇందుకూరి వెంకటపతి రాజు పాల్గొన్నారు. సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీతారామరాజు చిత్రపటానికి ఎంపీపీ వీరా మల్లిబాబు పూలమాలలు వేశారు. ఎంపీడీఓ పీవీ సత్యనారాయణ, ఏపీఓ నాగప్రసాద్ పాల్గొన్నారు.

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఇన్‌చార్జి హెచ్ఎం జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులర్పించారు. అలాగే పింగళి వెంకయ్య వర్ధంతిని నిర్వహించారు.

కొత్తపేట: విప్లవజ్యోతి అల్లూరి పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. వాడపాలెంలో అల్లూరి విగ్రహానికి ఆ పార్టీ నేతలు పూలమాలలు వేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి, ఆర్ఎస్ఎస్ కోనసీమ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు, సలాది స్వామినాయుడు పాల్గొన్నారు. కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

మామిడికుదురు: లూటుకుర్రు పంచాయతీ కార్యాలయంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. పెదపట్నంలంక, మామిడికుదురు తదితర గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీలు కొమ్ముల జంగమయ్య, నామన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల సభ్యులు దాట్ల సత్యనారాయణరాజు, వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, అధ్యాపకులు రాజ్‌కుమార్, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్ట్ పార్కులో మండల క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. యూత్ నాయకులు కొల్నాడ సత్యనారాయణరాజు, వేటుకూరి సూరిబాబు, పేరిచర్ల నాగరాజు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఉచ్చిలి, పులిదిండి, వసంతవాడ, తాడిపూడి గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఆత్రేయపురంలో అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద వేడుకలు జరిగాయి. అనంతరం పలు గ్రామాల్లో స్వీట్లు పంచారు. స్థానిక మహాత్మాగాంధీ విద్యా సంస్థలో అల్లూరి జయంతిని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్‌రాజు, ప్రిన్సిపాల్ బీవీఆర్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అల్లూరి జయంతిని హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

రావులపాలెం: స్థానిక బాలుర హైస్కూల్ ప్రాంగణంలో అల్లూరి విగ్రహానికి కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేశారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఊబలంక మదర్ థెరీసా ఆశ్రమంలో చిన్నారులతో కన్వీనర్ నడింపల్లి సుబ్బరాజు వర్మ కేక్ కట్ చేయించారు. అనంతరం ఆశ్రమానికి దండు సత్యనారాయణ రాజు, దండు శివరామరాజులు ఏసీని బహూకరించి నిర్వాహకుడు దిడ్ల కిశోర్‌కు అందజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



వాడపాలెంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రాష్ట్ర బీజేపీ నేత పాలూరి



లూటుకుర్రులో అల్లూరికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ తాతకాపు, స్థానికులు



ఊబలంక మదర్ థెరీసా ఆశ్రమంలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న పెద్దలు, చిన్నారులు

డెంగీపై అవగాహన ర్యాలీ



నాగుల్లంకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

పి.గన్నవరం: నాగుల్లంకలో పీహెచ్‌సీ వైద్యాధికారి వై.ప్రియాంక ఆధ్వర్యంలో గురువారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ దోమ కాటుతో ప్రబలే జ్వరాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ కె.దుర్గాబాయి, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఆందోళన

మలికిపురం: హిందువులపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మలికిపురం గాంధీ బొమ్మ సెంటర్‌లో విశ్వహిందూ పరిషత్, హిందూ ధర్మ రక్షత సమితి, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి, హిందూ ధర్మ రక్షత సమితి నాయకుడు అడబాల నరసింహారావు, నాయకులు ఇందుకూరి అచ్యుతరామరాజు, దొడ్డ నాగబాబు, మాలే శ్రీనివాస నగేష్, అడబాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మలికిపురం: తూర్పుపాలెంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్, జేసీబీలను పోలీసులు గురువారం సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. తూర్పుపాలెం వాసి కొంబత్తుల శ్రీనివాస్‌కు చెందిన జేసీబీని, గొల్లపాలెం వాసి గుండుమేను సాయికృష్ణకు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ జి.అనితకుమారి గురువారం తెలిపారు.

సదుపాయాలు లేకుంటే చర్యలు

ఆత్రేయపురం: మండలంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ పీవీ వరప్రసాదరావు హెచ్చరించారు. గురువారం ఆయన పలు పాఠశాలలను పరిశీలించారు. నిబంధనలకు లోబడి విద్యార్థుల ప్రవేశాలు ఉండాలన్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు తెలిపారు.

గొల్లపల్లి పరామర్శ

మలికిపురం: లక్కవరం గ్రామానికి చెందిన మంగేన రామం ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో మంగెన సింహాద్రి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి



మలికిపురంలో మొక్క నాటిన ఎంపీడీఓ మంగాదేవి

మలికిపురం: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నియోజకవర్గ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మలికిపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మొక్కలు నాటారు. ఎంపీడీఓ శ్రీమతి బి.మంగాదేవి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించవచ్చని అన్నారు. నాయకులు మాలే శ్రీనివాస నగేష్, ఎఫ్‌సీఐ సభ్యుడు దొడ్డా నాగబాబు, పరిపాలన అధికారి జి.మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రవికుమార్, పీహెచ్‌సీ సిబ్బంది

కొత్తపేట: వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ సూచించారు. డెంగీ, డయేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవిడిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ బీవీ సత్యనారాయణ, ఎంపీహెచ్ఏలు వాడ సద్గుణరావు, వెంకటరమణ, కె.మాచరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలని సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరంలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్ల ఆవశ్యకతను తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, పి.తులసి, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.అనూష, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అయినవిల్లి: తాటిపాక గెయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్షోత్సవాల సందర్భంగా గురువారం తొత్తరమూడి శానపల్లిలంక గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాటిపాక గెయిల్ ఇన్‌చార్జి కె.రాంబాబు పాల్గొని పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామస్తులకు వివరించారు. గెయిల్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.